క్లుప్తంగా

ప్రజా సంఘాల సానుభూతిపరుడు మృతి



పిడుగురాళ్ల: ప్రజా సంఘాల సానుభూతిపరుడు జె. అంజినాయక్(85) అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. మండలంలోని కోనంకి తండాలో ఆయన నివాసం ఉండేవారు. విషయం తెలుసుకున్న పీడీఎం రాష్ట్ర అధ్యక్షులు కె. శ్రీనివాసరావు, సీపీఎం జిల్లా అధ్యక్షులు ఓర్సు కృష్ణ తదితరులు వచ్చి ఆయన భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



యడ్లపాడు: బైక్ అదుపు తప్పి ఫోర్‌వీల్ ఆటోను ఢీకొన్న సంఘటనలో ఇద్దరికీ గాయాలైన సంఘటన మండల కేంద్రమైన యడ్లపాడులో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... యడ్లపాడు చెందిన పి.సతీష్‌బాబు, షేక్ చాన్‌షా బైక్‌పై సర్వీసు మార్గంలో యడ్లపాడు వైపు వస్తుండగా అదుపు తప్పింది. దీంతో అదే మార్గంలో వెళ్తున్న టాటాఏస్ వాహనాన్ని బైక్ వెనుక నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో సతీష్‌బాబు, చాన్‌షా రోడ్డుపై పడిపోవడంతో తీవ్రంగా గాయపడ్డారు. వారి వద్ద ఉన్న బ్యాగ్ లోంచి రూ.35 వేల నగదు, ఏటీఎం కార్డు కింద పడిపోయాయి. స్థానికుల సమాచారంతో రోడ్డు భద్రతా సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని బాధితుల్ని చిలకలూరిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఘటనా స్థలిలో లభించిన నగదు, ఏటీఎంలను పోలీసులకు అప్పగించారు.

కోదండ రాముడికి జన్మనక్షత్ర పూజలు



నాదెండ్ల: గణపవరం గ్రామంలో కొలువైయున్న శ్రీ కోదండ రామాలయంలో శనివారం స్వామివారి జన్మనక్షత్రమైన పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకుని పూజలు వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన పూజారులు దర్శి ఉమామహేశ్వరశర్మ, అనిల్ కుమార్‌లు స్వామివార్లను జలాభిషేకం నిర్వహించి, అనంతరం ప్రత్యేకంగా అలంకరించారు. అభిషేకాలు, అర్చనల అనంతరం తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. భక్తులు గోత్రనామ పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు వలేటి వెంకటేశ్వరరావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో గృహోపకరణాలు దగ్ధం



రొంపిచర్ల: విద్యుదాఘాతంతో గృహంలోని వస్తువులన్నీ దగ్ధమైన సంఘటన మండలంలోని అన్నవరప్పాడు కాలనీలో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. కాలనీకి చెందిన ఎం. చినకోటేశ్వరరావు కుటుంబ సభ్యులు రాత్రి వేళ ఇంటిలో నిద్రిస్తున్నారు. నిద్రిస్తున్న సమయంలో గృహంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ సంభవించి మంటలు వచ్చాయి. మంటలు రావటంతో నిద్రిస్తున్నవారంతా ప్రాణాలతో బయటపడ్డారు. ఈ ప్రమాదంలో గృహంలోని విలువైన వస్తువులన్నీ దగ్ధమయ్యాయి. సుమారు రూ.1.5 లక్షల మేర ఆస్తి నష్టం వాటిల్లింది.

కాచి చల్లార్చిన నీరు తాగాలి

సత్తెనపల్లి: పట్టణంలో పురపాలక సంఘ కుళాయిల ద్వారా సరఫరా చేస్తున్న మంచి నీటిని వర్షాకాలం దృష్ట్యా కాచి, చల్లార్చి వడగట్టి వినియోగించుకోవాలని మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మంచినీటి సరఫరాలో ఎటువంటి సమస్య ఉన్నా మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకురావాలని పేర్కొన్నారు.

జగ్జీవన్‌రామ్ సేవలు అజరామరం



వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

పిడుగురాళ్ల: అట్టడుగు వర్గాల అభివృద్ధి కోసం జీవితాన్ని త్యాగం చేసిన బాబు జగ్జీవన్‌రామ్ సేవలు అజరామరం అని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పిడుగురాళ్ల పట్టణ ఎస్సీ నాయకులు తెలిపారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో శనివారం బాబు జగ్జీవన్‌రామ్ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్సీ నాయకులు మాట్లాడుతూ... సమరయోధుడుగా, కేంద్ర మంత్రిగా, దేశ ఉప ప్రధానిగా బాబు జగ్జీవన్‌రామ్ ఎనలేని సేవలు అందించారన్నారు. ఆయన జీవితం దేశ ప్రజల కోసం అంకితం చేశారని పేర్కొన్నారు. యువతరం ఆయన్ను ఆదర్శంగా తీసుకొని ముందుకు నడవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ ఎస్సీ సెల్ పట్టణ అధ్యక్షులు కాలే మాణిక్యరావు, ఎస్సీ నాయకులు పసుపులేటి ఆనంద్, చల్లగుండ్ల స్వామి, మందా సుధీర్, మందా ప్రేమ్‌రాజ్, డేగల యోహాన్, సీహెచ్ అరుణ, కొమ్ము కల్యాణ్, జంగాల బాబు, మందా జాషువా, బంకా అనిల్, దాదినబోయిన ఏడుకొండలు యాదవ్, కత్తెరపు వాసుదేవరెడ్డి, మాచర్ల వెంకట్, పసుపులేటి కుమార్, పసుపులేటి అశోక్, మందా కనకయ్య, వైఎస్సార్ సీపీ ఎస్సీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాబు జగ్జీవన్‌రామ్‌కు ఎమ్మార్పీఎస్ నాయకుల నివాళి



బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ నేతలు

పిడుగురాళ్ల: డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ వర్ధంతి సందర్భంగా ఎమ్మార్పీఎస్ సహా పలు సంఘాల ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నివాళులు అర్పించారు. అంబేడ్కర్ ప్రచార కమిటీ అధ్యక్షులు డేగల అబ్రహాం అధ్యక్షత వహించగా, గురజాల నియోజకవర్గ ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు మీసాల బాబు తదితరులు ప్రసంగించారు. మీసాల బాబు మాట్లాడుతూ స్వాతంత్య్ర పోరాటంలో జగ్జీవన్‌రామ్ జైలు శిక్ష కూడా అనుభవించారని గుర్తుచేశారు. ఓటమి ఎరుగని రాజకీయ చాణక్యుడిగా పేరు సంపాదించారన్నారు. ఇప్పటికైనా ఆయనకు భారతరత్న ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ పట్టణ అధ్యక్షులు ఇజ్రాయేలు, రాజుపాలెం మండల అధ్యక్షులు నాగేశ్వరరావు, ఎస్‌హెచ్‌ఆర్‌జీ పల్నాడు జిల్లా అధ్యక్షులు మల్లయ్య, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు వట్టెపు మరియదాసు, లాజర్, కొమ్ము మరియదాసు, డేగల మరియదాసు, తాళ్లూరి అంకారావు, మందా రవి, షేక్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యంపై అధికారులు దృష్టి పెట్టాలి



మారుతీనగర్‌లో డయేరియాతో బాధపడుతున్న చిన్నారులను పరామర్శిస్తున్న టీడీపీ నాయకులు

పిడుగురాళ్ల: ప్రజలు అనారోగ్యం బారిన పడకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని పట్టణ టీడీపీ నాయకులు తెలిపారు. పట్టణంలోని లెనిన్‌నగర్, మారుతీ నగర్ ప్రాంతంలో డయేరియా ప్రబలి ప్రజలు ఇబ్బంది పడుతున్న విషయాన్ని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తెలుసుకొని టీడీపీ నాయకులను అప్రమత్తం చేశారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు మారుతీ నగర్ యూపీహెచ్‌సీలో వైద్య సేవలు పొందుతున్న డయేరియా రోగులను వారు పరామర్శించారు. పరిస్థితి విషమించి నరసరావుపేట ఏరియా హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న వారి బంధువులతో మాట్లాడి, వారికి ధైర్యం చెప్పారు. రోగులకు వైద్య సేవలు సకాలంలో అందించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షులు పాండురంగ శ్రీను, పల్నాడు జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షులు సయ్యద్ అమీర్ అలీ, నియోజకవర్గ అధికార ప్రతినిధి వండ్లవల్లి సాంబశివరావు, జనసేన జిల్లా నాయకులు షేక్ ఖాశీం సైదా, పార్టీ పట్టణ ఉపాధ్యక్షులు షేక్ సైదా, పట్టణ మైనార్టీ అధ్యక్షులు మస్తాన్ వలి, నాయకులు చిలక చిన్న, బాషా, పఠాన్ ఖాసీం సైదా, గడిపల్లి శ్యామ్, ఫణితి కృష్ణ, షేక్ మున్నా, బత్తుల నాగరాజు, కపిలవాయి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వారాహి నవరాత్రులు



సత్తెనపల్లి: పట్టణంలోని శ్రీ త్రిశక్తి దుర్గా పీఠంలో శనివారం వారాహి నవరాత్రుల పూజలను ప్రారంభించారు. ఈ సందర్భంగా దుర్గా మాతని వారాహి మాత అలంకరణలో లలిత సహస్ర నామ స్తోత్రం, అష్టోత్తర శతనామాలు, ద్వాదశ నామాలు, గాయత్రీ మంత్రంతో కుంకుమార్చన నిర్వహించారు. ప్రత్యేకంగా నైవేద్యాలు, మంత్ర పుష్పం, హారతులు అందించారు. కుంకుమ పూజలో పాల్గొన్న మహిళా భక్తులకు శ్రీ చక్ర మేరువ అందించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, అమ్మవారి కృపకు పాత్రులయ్యారు. పీఠాధిపతి వెలిదండ్ల హనుమత్ స్వామి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

స్వర్ణకార సంఘం లెటర్ ప్యాడ్‌ల అక్రమ వినియోగంపై చర్యలు



సత్తెనపల్లి: స్వర్ణకార సంఘం లెటర్ ప్యాడ్‌లను అక్రమంగా ఉపయోగిస్తున్న వారిపై తగిన చర్యలు తీసుకుంటామని వీరబ్రహ్మేంద్ర స్వర్ణకార సంఘం పట్టణాధ్యక్షుడు దాచేపల్లి వెంకట్ తెలిపారు. వేదా కళాశాల ఆడిటోరియంలో శనివారం పట్టణ స్వర్ణకార సంఘం సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ఇటీవల కొందరు సంఘం లెటర్ ప్యాడ్లను వినియోగించుకొని బ్యాంకుల్లో అప్రైజర్ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్నట్లు తమ దృష్టికి వచ్చిందని చెప్పారు. తమ సంఘం ద్వారా సిఫార్సు లేఖలను ఇవ్వలేదని ఆయన స్పష్టం చేశారు. బ్యాంకులను మోసం చేస్తూ.. లెటర్ ప్యాడ్‌లను అక్రమంగా వినియోగించుకోవడాన్ని తీవ్రంగా ఖండించారు. దీనిపై ఇప్పటికే అన్ని బ్యాంకు శాఖలకు సమాచారం అందించామని వెల్లడించారు. భవిష్యత్తులో ఇలాంటి చర్యలు పునరావృతమైతే.. చట్టపరంగా చర్యలు తీసుకోవాలని సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో సంఘ పూర్వ అధ్యక్షుడు కోనపర్తి యుగంధర్, సంఘ బాధ్యులు బంగారు లక్ష్మణాచారి, కాకుమాను మధు, తంగెళ్లపల్లి గురు భూషనాచారి, షేక్ మీరావలి పాల్గొన్నారు.

చదువుతోనే కుటుంబ అభివృద్ధి



కొప్పునూరులో ర్యాలీ నిర్వహిస్తున్న హెచ్‌ఎం నాగమణి, విద్యార్థులు, గ్రామ పెద్దలు

మాచర్ల రూరల్ : బడి ఈడు పిల్లలందర్ని పాఠశాలల్లో చేర్చి వారి కుటుంబ అభివృద్ధికి దోహదపడాలనే ప్రభుత్వ లక్ష్యానికి ప్రజలందరూ సహకరించాలని హెచ్‌ఎం ఐవీ నాగమణి కోరారు. శనివారం మండలంలోని కొప్పునూరు గ్రామంలో నేను బడికి పోతా కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్య ద్వారానే కుటుంబ ఆర్థిక పరిస్థితిలో మార్పు వస్తుందని చెప్పారు. తల్లిదండ్రులు తమ చిన్నారులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలన్నారు. అనుభవం కలిగిన ఉపాధ్యాయులతో బోధన, డిజిటల్ వసతులు, ఉచితంగా పౌష్టికాహారం, దుస్తులు, పుస్తకాలు, బెల్టు, టై వంటివి అందిస్తున్నామని చెప్పారు. ర్యాలీ తర్వాత మానవహారం ఏర్పాటు చేశారు. ఉపాధ్యాయులు పాల్‌రాజ్, అప్పారావు, శ్రీనివాసరావు, మధుబాబు, పెద యాసోబు, నారాయణ, ప్రసాదరావు విద్యార్థులు పాల్గొన్నారు.

ఆత్మవిశ్వాసంతో కృషి చేస్తే విజయం ఖాయం



విద్యార్థులతో గొంటు సుమంత్‌రెడ్డి, సింహాద్రి మోహన్ తదితరులు

రెంటచింతల: విద్యార్థులు లక్ష్యం నిర్దేశించుకుని ఆత్మవిశ్వాసంతో కృషి చేస్తే కచ్చితంగా ఉన్నత శిఖరాలను చేరుకుంటారని మాజీ వైస్ ఎంపీపీ గొంటు సుమంత్‌రెడ్డి అన్నారు. శనివారం స్థానిక ఏపీ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో 240 మంది విద్యార్థులకు స్టూడెంట్స్ కిట్స్‌ను అందించారు. ప్రిన్సిపల్ సింహాద్రి మోహన్, టీడీపీ నాయకులు కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం పేద విద్యార్థుల కోసం స్టూడెంట్ కిట్స్‌ను అందిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. విలువలు, క్రమశిక్షణతో గురువులు బోధించిన పాఠాలను చదివి మంచి ఫలితాలను సాధించాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ ఎస్. భాగ్యమేరి, ఉపాధ్యాయులు పిచ్చయ్య, సత్తార్ జ్‌బేగం, కృష్ణానాయక్, టీడీపీ నాయకులు బొడపాటి రామకృష్ణ, మూలి రాజారెడ్డి, మర్రి రాజ్‌కుమార్, మల్లయ్య, సిద్దయ్య, మునినాయక్, తోమాస్, శౌరి నాయక్, మారా శ్రీను, మూలి రాయపురెడ్డి, సామేల్, ఎం. రవికుమార్, సిల్వరాజ్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలి



సభ్యత్వ నమోదు అందజేస్తున్న ఎస్టీయూ నాయకులు

చిలకలూరిపేట: మున్సిపల్ ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలని ఎస్టీయూ రాష్ట్ర పూర్వ కార్యదర్శి పోటు శ్రీనివాసరావు కోరారు. పట్టణంలోని మున్సిపల్ పాఠశాలల్లో ఎస్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం గత 77 సంవత్సరాలుగా ఉపాధ్యాయుల సంక్షేమం, విద్యారంగ పరిరక్షణే ధ్యేయంగా పనిచేస్తున్నదన్నారు. మున్సిపల్ ఉపాధ్యాయుల బదిలీలను పారదర్శకంగా నిర్వహించాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న డీఏ, పీఆర్‌సీ బకాయిలు వెంటనే చెల్లించాలని కోరారు. మున్సిపల్ ఉపాధ్యాయులకు ప్రావిడెంట్ ఫండ్ అకౌంట్ ఏర్పాటు చేయాలన్నారు. విద్యావ్యవస్థలో బోధనేతర పనుల భారం తగ్గించాలన్నారు. మున్సిపాలిటీల్లో జూనియర్ కాలేజ్ (హైస్కూల్ ప్లస్) ఏర్పాటు చేయాలని, అర్బన్ ఎంఈవోలుగా మున్సిపల్ హైస్కూల్ హెచ్‌ఎంలకు అవకాశం కల్పించాలన్నారు. ఉపాధ్యాయ సంఘాలతో చర్చించి విద్యావ్యవస్థతో మార్పులు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో ఎస్టీయూ పల్నాడు జిల్లా కార్యదర్శి వినుకొండ అక్కయ్య, నాయకులు మేకల కోటేశ్వరరావు, వడ్లాన జయప్రకాశ్, ఇనకొల్లు అంకమ్మరావు తదితరులు పాల్గొన్నారు.

శ్యాంప్రసాద్ ముఖర్జీకి ఘన నివాళి

చిలకలూరిపేట: జనసంఘ్ వ్యవస్థాపకుడు శ్యాంప్రసాద్ ముఖర్జీ గొప్ప నాయకత్వ లక్షణాలు ఉన్న వ్యక్తి అని బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ తాటిపర్తి జయరామిరెడ్డి చెప్పారు. పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో శ్యాంప్రసాద్ ముఖర్జీ జయంతిని శనివారం నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాటి జనసంఘ్ నేటి బీజేపీగా రూపాంతరం చెందిందని చెప్పారు. నేటి తరం నాయకులకు ఆయన ఆదర్శనీయుడని కొనియాడారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు పొత్తూరి బ్రహ్మనందం, నియోజకవర్గ కోకన్వీనర్ మల్లెల శివనాగేశ్వరరావు, నాయకులు కస్తూరి వెంకటేశ్వర్లు, పులుగుజ్జు మహేష్, ఉప్పాల భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

బోధనకు ఆటంకంగా ఉన్న యాప్‌లను రద్దు చేయాలి



సభ్యత్వ నమోదులో పాల్గొన్న యూటీఎఫ్ నాయకులు

నరసరావుపేట ఈస్ట్: పాఠశాలలో బోధనకు ఆటంకం కలిగించే యాప్‌లను రద్దు చేయాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పి.ప్రేమ్‌కుమార్ తెలిపారు. మున్సిపల్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన యూటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్న ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ, పాఠశాలల్లో పెరుగుతున్న విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులను నియమించాలన్నారు. మున్సిపల్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు నూతన ప్రభుత్వం ప్రమోషన్లు కల్పించాలని, పీఎఫ్ ఖాతాలను తెరవాలని కోరారు. ప్రాథమిక పాఠశాలలను విచ్ఛిన్నం చేసే 117 జీఓను రద్దు చేయాలన్నారు. కాకినాడలో జరగనున్న యూటీఎఫ్ స్వర్ణోత్సవ వేడుకల్లో ఉపాధ్యాయులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ ఆడిట్ సభ్యుడు ఆంజనేయులు, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు డి.కోటేశ్వరరావు, వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు , తదితరులు పాల్గొన్నారు.

వైరస్‌లను తట్టుకునే విత్తనాలు వాడాలి



మండల వ్యవసాయ అధికారి బ్రహ్మారెడ్డి

రెంటచింతల: మండలంలోని వివిధ గ్రామాలలో పత్తి, మిరప పంటలను సాగు చేసే రైతులు నాణ్యమైన విత్తనాలను ఎంపిక చేసుకోవడం ఎంతో అవసరమని మండల వ్యవసాయ అధికారి బోయపాటి బ్రహ్మారెడ్డి సూచించారు. వైరస్ తెగుళ్లను తట్టుకునే రకాలకు చెందిన కంపెనీ విత్తనాలు వాడాలని కోరారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఖరీఫ్‌లో పత్తి, మిరప పంటలను సాగు చేస్తున్న రైతులు తీసుకోవాల్సిన సమగ్ర సస్యరక్షణ విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. పత్తి పంటకు ఎక్కువగా గులాబీ రంగు పురుగు తీవ్రనష్టం కలిగిస్తుందన్నారు. వ్యవసాయ అధికారుల సూచనల మేరకు ఈ పురుగు నివారణకు పిచికారీ మందులను వాడుకోవాలని తెలిపారు. మిరపను సుమారు 82 రకాల వైరస్‌లు ఆశించి నష్టపరుస్తాయని గుర్తుచేశారు. మూడేళ్లుగా పలు జిల్లాలలో మిరపపంటకు ఈ తెగుళ్లు ఆశించడం వలన రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. మన రాష్ట్రంలో ఎక్కువగా పంటలకు ఆకు ముడత, కుకుంబర్ మొజాయిక్, మొవ్వకుళ్లు వైరస్‌లు వ్యాప్తి చెందుతున్నాయని పేర్కొన్నారు. రైతులు పంటలను సాగు చేసే ముందు పొలంలో భూసార పరీక్షలు చేయించుకోవడం వల్ల మరిన్ని ప్రయోజనాలు పొందవచ్చన్నారు. పంట మార్పిడి విధానాన్ని అనుసరించడం మంచిదని సూచించారు. సేంద్రియ ఎరువులను ఎక్కువగా వాడి సమతుల్య ఎరువుల యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన కంపెనీలకు చెందిన మూడు, నాలుగు రకాల విత్తనాలను రైతులు కొనుగోలు చేసి పంటలను సాగు చేసుకోవాలన్నారు. రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి సేంద్రియ ఎరువులను వినియోగించడం వల్ల తక్కువ పెట్టుబడితో మంచి దిగుబడులను సాధించవచ్చునని పేర్కొన్నారు.

వ్యవసాయ పనులలో అన్నదాతలు



సాళ్లు తోలుతున్న రైతు



పత్తి విత్తనాలు వేస్తున్న కూలీలు

రెంటచింతల: మండలంలోని పలు గ్రామాలలో రైతులు ముమ్మరంగా వ్యవసాయ పనులలో నిమగ్నమయ్యారు. శుక్రవారం రాత్రి మండలంలో సుమారు 26.4 మి. మీ. వర్షపాతం నమోదు అయింది. దీంతో రైతులు ఉత్సాహంగా పంటలను సాగు చేసేందుకు పొలంబాట పట్టారు. ఇటీవల కొద్దిరోజులుగా వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో అన్నదాతలు ఆందోళన చెందారు. ఎప్పుడు వర్షం పడుతుందోనని ఆకాశం వైపు చూడసాగారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ద్రోణి కొనసాగుతుండటం కారణంగా కురిసిన వర్షానికి వాతావరణం చల్లబడి పొలం సాగుకు అనుకూలంగా ఉండటంతో రైతులు పత్తి విత్తనాలు వేసేందుకు సిద్ధమయ్యారు. మండలంలోని 11 గ్రామాలలో మొత్తం 10,358 హెక్టార్ల సాగు భూమిలో 2024–25 ఖరీఫ్ సీజన్‌లో మిర్చి 4,686 హెక్టార్లు, పత్తి – 3,272, వరి–1,864, మిగిలిన 536 హెక్టార్లలో మొక్కజొన్న, కంది, పెసర, మినుము, జొన్న వంటి అపరాలను రైతులు సాగు చేస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి బోయపాటి బ్రహ్మారెడ్డి తెలిపారు.

విద్యాభివృద్ధికి ‘రాంసా’ సేవలు అమూల్యం



విద్యార్థులకు ప్లేట్లు అందిస్తున్న ఎంఈఓ సురేష్, హెచ్‌ఎం విజయకుమారి

మాచర్ల రూరల్ : వెనుకబడిన పల్నాటి ప్రాంతంలోని విద్యార్థుల ప్రతిభను వెలికితీసేందుకు రాంసా సంస్థ అందిస్తున్న సేవలు ఎంతో అమూల్యమైనవని ఎంఈఓ అల్లి సురేష్ అభినందించారు. శనివారం మండలంలోని కంభంపాడు జెడ్పీహెచ్ పాఠశాలలో రాంసా సంస్థ తరఫున అందజేసిన ప్లేట్లు, గ్లాసులు విద్యార్థులకు పంపిణీ చేశారు. అనంతరం ఎంఈఓ మాట్లాడారు. విద్యాపరంగా వెనుకబాటుతనాన్ని ఎదుర్కొంటున్న ఈ ప్రాంతంలో రాంసా ఉచితంగా పుస్తకాలు అందించడం గొప్ప విషయం అన్నారు. విద్యార్థులలోని ప్రతిభను వెలికితీసేందుకు బ్రెయిన్ ఆఫ్ పల్నాడు, విజ్ఞాన మనోవికాస తరగతులు నిర్వహించం అభినందనీయం అన్నారు. 10వ తరగతి విద్యార్థులకు అవసరమైన సామగ్రిని అందించడంతోపాటు పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనలో ఆర్థిక సహాయం ఎంతగానో ఉపయోగపడుతోందన్నారు. హెచ్‌ఎం రామిరెడ్డి, విజయకుమారి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రాంసా గౌరవాధ్యక్షురాలు బైరెడ్డి వెంకటరమణ, బైరెడ్డి అమరలింగారెడ్డి, శ్యాంసుందరరెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం సంస్థ ప్రతినిధి వెంకటరమణను సత్కరించారు.

పెంపుడు కుక్కలకు ఏటా రేబీస్ టీకాలు



పెంపుడు కుక్కకు టీకా వేస్తున్న మండల పశువైద్యాధికారి షేక్ బషీర్



పెంపుడు జంతువులకు వ్యాక్సిన్ వేస్తున్న వైద్యాధికారి నాగమల్లీశ్వరరావు

రెంటచింతల: ఇళ్లలో పెంచుకుంటున్న కుక్కలకు ఏటా యాంటీ రేబీస్ టీకాలు వేయించాలని మండల పశువైద్యాధికారి షేక్ బషీర్ అన్నారు. శనివారం ప్రపంచ జూనోసిస్ డే సందర్భంగా స్థానిక పశువైద్యశాలలో పెంపుడు జంతువులకు ఉచితంగా యాంటీ రేబీస్ టీకాలను వేసి ఆయన మాట్లాడారు. ప్రతి ఏడాది జూలై 6 న ప్రపంచ జూనోసిస్ డే సందర్భంగా ప్రజలను అప్రమత్తం చేస్తూ అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. పెంపుడు జంతువులతో సన్నిహితంగా ఉండేవారికి రేబీస్, ఆంత్రాక్స్, బ్రుసుల్లోసిస్, క్షయ తదితర వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని హెచ్చరించారు. పెంపుడు జంతువులను తాకిన సమయంలో చేతులను యాంటిసెప్టిక్ లోషన్లు, సబ్బులతో శుభ్రం చేసుకోవాలని సూచించారు. పశువులు ఈనిన సమయంలో వాటి స్రావాలను, పిండాలను సుమారు మూడు అడుగుల లోతులో పూడ్చి పెట్టాలని పేర్కొన్నారు. కుక్క కాటుకు గురైన వ్యక్తి వెంటనే వైద్యుడిని సంప్రదించి తగిన చికిత్స పొందాలన్నారు.

పెంపుడు జంతువులతో జాగ్రత్త

గురజాల : పెంపుడు జంతువులతో కూడా జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఉందని పశువైద్యశాల ఏడీ నాగమల్లీశ్వరరావు అన్నారు. స్థానిక పశువైద్యశాలలో శనివారం ప్రపంచ జూనోసిస్ దేను పురస్కరించుకుని పెంపుడు జంతువులకు రేబీస్ వ్యాక్సిన్ వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెంపుడు జంతువుల నుంచి రేబీస్ వ్యాధి సోకకుండా ముందస్తుగా వ్యాక్సిన్ వేయించాలన్నారు. మొత్తం 96 పెంపుడు జంతువులకు వ్యాక్సిన్ అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వెటర్నరీ అసిస్టెంట్ జక్కా మల్లికార్జునరావు, సిబ్బంది పాల్గొన్నారు.